

రియాజ్‌ను సన్మానిస్తున్న కొక్కుల దేవేందర్ తదితరులు

బుక్ కల్చర్ అలవర్చుకుంటే యువతకు బంగారు భవిష్యత్

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పాఠకులు, నిరుద్యోగులు గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. రియాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను తెలంగాణ గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ ఆధ్వర్యంలో పలువురు పెన్షనర్లు సన్మానించారు. రియాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విలువైన సమాచారం ఉంటుందని, అది పాఠకులకు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లుక్ కల్చర్ తగ్గించుకుని బుక్ కల్చర్‌ను అలవర్చుకుంటే యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. పుస్తకాలు చదవడం వల్ల ఎంతో విజ్ఞానం అలవడుతుందన్నారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర కమిటీ ప్రధానకార్యదర్శి సోమ శివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, సభ్యులు ఆదం షఫీ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● ఎంపీ డా. కె. లక్ష్మణ్



వైద్యుడు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఎంపీ డా. కె. లక్ష్మణ్

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ డా. కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. కాస్మోపాలిటన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలో డాక్టర్స్‌డే సందర్భంగా ప్రముఖ వైద్యుడు వెంకటేశ్వరరావును సత్కరించి ప్రతిభా అవార్డును బహూకరించారు. సేవా కార్యక్రమంలో భాగంగా ఈ సందర్భంగా ఆరుగురు దివ్యాంగులకు వీల్‌చైర్‌లు, 10 మంది అంధులకు చేతికర్రలు, స్టిక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, నిర్వాహక సంస్థ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సలహాదారులు గోపాలకృష్ణమూర్తి, చెంచయ్య, వెంకటేశ్వర్లు, ఇంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అందరూ మొక్కలు నాటితే ప్రకృతిని కాపాడినవారమవుతామని కార్పొరేటర్ పావని అన్నారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ తన తల్లి పేరిట కార్పొరేటర్‌తో కలిసి ఆదివారం మొక్క నాటారు. జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకోవడం అందరి సామాజిక బాధ్యత అని అన్నారు. జయప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్, చంద్రిక, సుధ, మురళి, రామకృష్ణ, రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వష్టి కథా సంపుటిలో చక్కని భావం, శిల్పం

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వష్టి కథా సంపుటిలో చక్కని భావం, శిల్పం ఉన్నాయని రచయిత సయ్యద్ సలీమ్ అన్నారు. లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో రచయిత్రి శైలజామిత్ర రచించిన వష్టి కథల సంపుటి ఆవిష్కరణ జరిగింది. సలీమ్ మాట్లాడుతూ.. సమాజపరంగా ఎంతో అవసరమైన కథలు ఈ సంపుటిలో ఉన్నాయన్నారు. రచయిత్రి అలూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఈ కథలు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉన్నాయన్నారు. కస్తూరి అలివేణి, సరస్వతి, జానకిదేవి, కృతిస్వీకర్త సత్యమిత్ర, హనిష పాల్గొన్నారు.

28 నుంచి బీఎల్‌ఫ్ భూ సదస్సులు

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ నెల 28 నుంచి ఆగస్టు 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌ఎఫ్ భూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహకారం అందించేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎల్‌ఎఫ్ నాయకులు వనం సుధాకర్, గాదగోని రవి, దండి వెంకట్, నూనె వెంకటస్వామి, కె. సత్యనారాయణ, సైదులు, సిద్ది రాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్మచరణ సమితికి ఫర్నిచర్ వితరణ



ధర్మచరణ సమితికి కుర్చీలు అందజేస్తున్న పులి సందీప్‌గౌడ్

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బాకారం ధర్మచరణ సమితికి ప్రముఖ సంఘసేవకుడు, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పులి సందీప్‌గౌడ్ 150 కుర్చీలు, ఇతర ఫర్నిచర్‌ను బాకారం ధర్మచరణ సమితి అధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోగా కాచిగూడ హాస్టల్‌ను ప్రారంభించాలి



హాస్టల్ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థులు

గోల్నాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలుగా మూతపడిన నింబోలిఅడ్డాలోని కాచిగూడ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను తిరిగి ప్రారంభించాలని హాస్టల్ రీ ఓపెన్ పోరాట సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆగస్టు 15వ తేదీలోగా హాస్టల్‌ను ప్రారంభించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆదివారం హాస్టల్‌ను పూర్వ విద్యార్థులు, కాచిగూడ హాస్టల్ రీ ఓపెన్ పోరాట సమితి ప్రతినిధులు సందర్శించి గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి రుద్రవరం లింగస్వామి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సాకులతో కాచిగూడ హాస్టల్‌ను మూసివేసి విద్యార్థులను బలవంతంగా ఇక్కడి నుంచి తరలించిందని ఆరోపించారు. కార్యక్రమంలో గిరి, బొమ్మెర రామ్మూర్తి, సంగమేశ్వర్, కిరణ్, చారి, జగదీష్, రాము, గోవింద్, గణేశ్, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు.. చైల్డ్ హోంకు తరలింపు



బాలుడు

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయి రోడ్డుపై ఏడుస్తున్న రెండేళ్ల వయసు గల బాలుడిని ముషీరాబాద్ పోలీసులు చేరదీసి చైల్డ్ హోంకు తరలించారు. బాపూజీనగర్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో రెండేళ్ల వయస్సుగల బాలుడు ఏడుస్తూ తిరుగుతున్నాడు. స్థానికులు గమనించి ముషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. చిన్నారికి మాటలు రావడం లేదని, చైల్డ్ హోంకు తరలించామని సీఐ నిరంజన్ చెప్పారు.

‘డబుల్’ ఇళ్లలో సౌకర్యాలు కల్పించాలంటూ ధర్నా



ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్ తదితరులు

కవాడిగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో నిర్మించిన 65 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సౌకర్యాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వర్ డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సంక్షేమ సంఘం, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ పాల్గొని మద్దతు ప్రకటించారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించకుండానే హడావిడిగా ఇళ్లను కేటాయించిందని ఆరోపించారు. ‘డబుల్’ ఇళ్లలో సౌకర్యాలు కల్పించకపోతే లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఎం. దశరథ్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. శ్రీనివాస్‌రావు, మహేందర్, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర కార్యదర్శి కె.నాగలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలుగు నటీ, నటులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● ప్రముఖ నటుడు పృథ్వీరాజ్



మాట్లాడుతున్న పృథ్వీరాజ్

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు నటీ, నటులకు తెలంగాణ చలనచిత్ర పరిశ్రమ ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాలని తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్ కోరారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. యూనియన్‌ను నమ్ముకున్న కళాకారులకు తగిన పారితోషికం లభించేలా, పేద కళాకారులకు రేషన్‌కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. యూనియన్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి బి. నూకరాజు, ఆల్ కమిటీస్ చైర్మన్ నందూరి రాము, జాయింట్ సెక్రటరీ రామ్మోహన్, వర్కింగ్ మహిళా అధ్యక్షురాలు ఆశ, ఉపాధ్యక్షులు పద్మరేఖ, శ్రీనివాస్‌రాథోడ్, కోశాధికారి ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.పి.రెడ్డి, రజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఇతర కులాలకు ఆదర్శంగా నిలవాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బర్కత్‌పుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు ఇతర కులాలకు ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సంఘాలుగా విడిపోవడం కంటే సమైక్యంగా ఒక్కటి కావాలని సూచించారు. ఆదివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో మున్నూరుకాపు ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం, వివాహ పరిచయ వేదిక నిర్వహించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చట్టసభలలో మున్నూరుకాపుల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు గ్రామస్థాయి నుంచి మున్నూరుకాపులు ఏకమై బీసీలతో కలిసి ఉద్యమించాలని సూచించారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ.. కులం పేరుతో టికెట్‌లు సాధించిన ప్రజాప్రతినిధులు కుల కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. మున్నూరుకాపులు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని, అది ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మున్నూరుకాపు మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు మణికొండ వెంకటేశ్వరరావు, మంగళారపు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. వివాహ పరిచయ వేదికకు మంచి స్పందన వచ్చిందని, 25 మంది వధువులకు ట్రస్ట్ సభ్యుడు తోట రఘునాథ్ ఉచితంగా పుస్తె, మెట్టెలు ఇచ్చేందుకు అంగీకరించారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంపా చంద్రమోహన్, మాజీ అధ్యక్షుడు దామెర జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు బీఆర్. జితేందర్, మణికొండ రమేష్, కొండూరి వినోద్‌కుమార్, శ్రీకాంత్, వెంకన్న, ఎల్. అనిల్‌కుమార్, కోశాధికారి లింగిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇప్పించాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇప్పించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తల్లిదండ్రులకు సూచించారు. గోల్నాక డివిజన్ గంగానగర్‌లోని గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు మహిళలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ విక్కీ విజయకుమార్, సంతోష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవీఆర్ కరాటే అకాడమీలో..

బర్కత్‌పుర: ఆత్మరక్షణ, శారీరక వ్యాయామం కోసం విద్యార్థులు కరాటేలో శిక్షణ పొందాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ సూచించారు. కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో ఆదివారం జరిగిన కలర్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన 36 మంది విద్యార్థులకు కరాటే బెల్ట్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్. గోపాల్‌రెడ్డి, బ్లాక్ బెల్ట్ మాస్టర్లు కరీం, అమృతారెడ్డి, రంజిత్‌సింగ్, శివ, షైనీ తదితరులు పాల్గొన్నారు.

దళిత చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై

లోతైన పరిశోధన జరగాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దళిత చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై లోతైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం తెలుగు వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఫూలే అంబేడ్కర్ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో దళిత చరిత్ర- సంస్కృతి - సాహిత్యం పునర్మూల్యాంకనం-ఖాళీల పూరింపు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన దళితోద్యమ వేగు చుక్క భాగ్యరెడ్డి వర్మ, ఇమానం పుస్తకాలను తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి, ఉస్మానియా వర్సిటీ తెలుగు శాఖ ఆచార్యులు చింతకింది కాశీం ఆవిష్కరించారు. దళిత ఉద్యమకారుడు భాగ్యరెడ్డి వర్మ జీవితం ఈతరానికి ఆదర్శప్రాయమని వారన్నారు. మహనీయుల జీవితాన్ని అక్షరీకరించి ఈ తరానికి అందించడం అభినందనీయమని అన్నారు. చరిత్రను మరింత పరిశోధించి భవిష్యత్‌కు అందించాల్సిన బాధ్యత మేధావులపై ఉందని అన్నారు. సదస్సులో హైదరాబాద్ వర్సిటీ తెలుగు శాఖ ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు కీలకోపన్యాసం చేశారు. అనంతరం గుడిపల్లి నిరంజన్, సుబ్బాచారి పులికొండ, కోయి కోటేశ్వరరావు, రజిత కొమ్ము, ఎం.ఎ.మాలిక్, సైబాబా, సామిడి జగన్‌రెడ్డి తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు.

బంగ్లాదేశ్ నుంచి నగరానికి తీసుకొచ్చి..

బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి

● పెళ్లి చేసుకుని భార్యతో దందా

● తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన యువతి

హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ యువతితో బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తప్పించుకున్న యువతి పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెను హోంకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. పూణెకు చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజులు బంగ్లాదేశ్‌లో ఉండి అక్కడి యువతిని పెళ్లి చేసుకున్నాడు. సముద్ర మార్గం ద్వారా రహస్యంగా ఇండియాకు తీసుకొచ్చి పుణెలో కాపురం పెట్టాడు. ఆమె పేరుతో ఆధార్‌కార్డు సైతం సృష్టించాడు. కొద్ది రోజుల తర్వాత అతడికి అప్పటికే పెళ్లయిన విషయం ఆమెకు తెలిసింది. దాంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి.

ఈ క్రమంలో ఆమెను వదిలించుకోవాలని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. కిస్మత్‌పూర్‌లో తన తమ్ముడు షాకీర్ వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. షాకీర్ ఆమెను భయపెట్టి లొంగదీసుకుని, ఢిల్లీకి చెందిన జాకీర్‌కు అమ్మేశాడు. జాకీర్ పుణెకు చెందిన మరో మహిళతో హైదరాబాద్‌లోనే ఉంటూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బంగ్లాదేశ్ యువతిని కూడా కొద్దిరోజులు నిర్బంధించి వ్యభిచార వృత్తిలోకి దింపాడు. ఆన్‌లైన్‌లో విటులతో బేరం కుదుర్చుకొని ఆటోలో తీసుకెళ్లి కస్టమర్స్ వద్దకు, హోటళ్లకు తిప్పేవాడు. వచ్చిన డబ్బులు జాకీర్, పుణెకు చెందిన మహిళ తీసుకునేవారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ యువతికి, పుణె మహిళకు గొడవ జరిగింది. తెలుసుకున్న జాకీర్ యువతిని తీవ్రంగా కొట్టాడు. దాంతో ఆమె వారి చెర నుంచి తప్పించుకొని స్థానికుల సహాయంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు జాకీర్, పుణె మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. వీరి వెనుక ఇంకా ఏదైనా ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తలకు మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి

రైల్లో బంగారు నగలు, నగదు చోరీ

బర్కత్ పుర జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు మత్తు మందు కలిపిన శీతల పానీయం ఇచ్చి బంగారు నగలు, నగదును దొంగలు చోరీ చేశారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా వేంపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి(72) భార్యతో కలిసి బెంగళూరులో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి శనివారం మియాపూర్‌లో నివసిస్తున్న కుమార్తె వద్దకు రావడానికి మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వస్తుండగా రైల్లో ఇద్దరు అపరిచిత వ్యక్తులు పరిచయమై, లోయర్ బెర్తులను ఇచ్చారు. హిందూపురం రైల్వేస్టేషన్ సమీపంలో వెంకట్రాంరెడ్డి దంపతులు వారిని తినమని అరటి పండ్లు ఇచ్చారు. ప్రతిగా వారు మత్తు మందు కలిపిన శీతల పానీయం ఇచ్చారు. అది తాగిన దంపతులు మత్తులోకి జారుకున్నారు. ఆదివారం రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చిన తర్వాత వారికి మెలకువ వచ్చింది. లేచిచూడగా పక్కనే ఉన్న బ్యాగు కనిపించలేదు. దానిలో 80 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ. 2 వేలు ఉన్నాయి. బాధితులు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసి హిందూపురం రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు

బస్సులో..

కొత్తపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బస్సులో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. ఎల్బీనగర్ సిరీస్ రోడ్డులో వాస్తు కాలనీలో నివసిస్తున్న ఎస్.పద్మలత(45) గురువారం మల్లాపూర్ సూర్యనగర్ కాలనీకి వెళ్లి రెండున్నర తులాల బంగారు ఆభరణాలను రీమోడల్ చేయించుకుని ఆటోలో హబ్సిగూడ వచ్చింది. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో కామినేని చౌరస్తాకు చేరుకుంది. బస్సు దిగి కొంతదూరం నడిచిన తర్వాత బ్యాగు చూసుకోగా నగలు కనిపించకపోవడంతో శుక్రవారం ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. బీఎన్ఎస్ ప్రకారం వారు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఎల్బీనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.

శాకంబరి అలంకరణలో మహంకాళి



శాకంబరి అలంకరణలో అమ్మవారు

నల్లకుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలలో భాగంగా ఆదివారం అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించారు. కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బాగ్‌అంబర్‌పేట, అంబర్‌పేట డివిజన్ల కార్పొరేటర్లు బి. పద్మవెంకటరెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కె. పద్మావతిరెడ్డి, నేమూరి సాంబశివగౌడ్, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆర్గనైజర్ కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై. శంకర్‌గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బిందీ మల్లికార్జున్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి కిషోర్, కార్యదర్శి చెంగల్ సుధాకర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, ప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎం. భాగ్యలక్ష్మి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

బర్కత్‌పుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు చెందిన పీజీ డాక్టర్స్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 2020 సంవత్సరానికి చెందిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో పీజీ డాక్టర్స్ ఆక్షిత, అనిల్‌కుమార్, ఎ. రాజేష్, శ్యామ్‌కుమార్‌గౌడ్, మహేష్, రత్నాకర్ తదితరులు ఉన్నారు.

ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు

దరఖాస్తు గడువు పొడిగింపు

బర్కత్‌పుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు దరఖాస్తు గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు అకాడమీ చైర్మన్ ఎం. సి. శేఖర్ తెలిపారు. శిక్షణా తరగతులు ఆరు నెలల పాటు రవీంద్రభారతిలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8008021075, 7095692175 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

‘కంటి సమస్యలను అశ్రద్ధ చేయొద్దు’

అంబర్‌పేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బాపూనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ ప్రారంభించారు. కంటి సమస్యలను అశ్రద్ధ చేయొద్దని ఎమ్మెల్యే సూచించారు.

అంబర్‌పేటలో దళితుల సర్వే

అంబర్‌పేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దళితుల సర్వే నిర్వహిస్తున్నట్లు దళిత సీనియర్ నాయకుడు బీవీ రమణ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట అలీకేఫ్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాలలో దళిత కుటుంబాల సర్వే నిర్వహించారు.

‘వైశ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి’

ముషీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైశ్యులను ఏకతాటిపైకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ అధ్యక్షుడు వీరేందర్ గుప్తాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులకు నియామకపత్రాలు అందజేసి మొక్కలు నాటారు. బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.మోహన్‌గౌడ్, ఐవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంజుల, రాంనగర్ డివిజన్ అధ్యక్షురాలు సితార పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ లక్ష్యం



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలో గండి కృష్ణ, గజ్జల రాజశేఖర్ తదితరులు

ముషీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల నుంచి ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని జాతీయ నాయకుడు గండి కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ ఇందిరానగర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్, నాయకులు ఎల్లయ్య, రోషన్ వినయ్‌రావు, జగదీష్, రాజు, జంగయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దాసరి శ్రీనివాసులు తదితరులు

‘చిగురించిన జ్ఞాపకాలు’ ఆవిష్కరణ

రాంనగర్, ఆంధ్రజ్యోతి జూలై 14 (ఆంధ్రజ్యోతి): రచయిత కొప్పుల ప్రకాశం రచించిన ‘చిగురించిన జ్ఞాపకాలు’ పుస్తకావిష్కరణ సభ నారాయణగూడలోని హోటల్ తాజ్ మహల్‌లో ఆదివారం జరిగింది. ఐఏఎస్ విశ్రాంత అధికారి దాసరి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనుకున్నది సాధించేవరకు అలుపెరగకుండా శ్రమించడమే కొప్పుల ప్రకాశం ప్రత్యేకత అన్నారు. 82 ఏళ్ల వయస్సులో ఓపిగ్గా తన జీవితంలోని జ్ఞాపకాలు, అనుభవాలను స్వదస్తూరితో పుస్తకరూపంలో తీసుకురావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నటుడు సంజయ్ రాయచూర, ప్రముఖ రచయిత ముదిగొండ శివప్రసాద్, సత్యనారాయణ, పద్మినీ ప్రియదర్శిని, ఇందిరా ప్రియదర్శిని, కృష్ణమోహన్, సురేఖ, రామకృష్ణ పాల్గొన్నారు.

ముషీరాబాద్, అంబర్‌పేటలో భారీ వర్షం



అజామాబాద్‌లో ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వీఎస్టీ చౌరస్తాలో రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో రాంనగర్ వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అశోక్‌నగర్ బ్రిడ్జి, కవాడిగూడ, గణేష్‌నగర్, బాప్టిస్ట్ చర్చి, నాగమయ్యకుంట, అంజయ్యనగర్, పద్మాకాలనీ తదితర ప్రాంతాలలో, అంబర్‌పేట నియోజకవర్గంలో ఛేనంబర్ చౌరస్తా, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద, పటేల్‌నగర్, గోల్నాక చౌరస్తా, నింబోలిఅడ్డ, నర్సింహబస్తీ, బాయమ్మగల్లీ తదితర ప్రాంతాలలో నీరు నిలవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులుపడ్డారు.